క్లుప్తంగా

21న మామిడి అప్పలసూరి వర్ధంతి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

నరసన్నపేట: ఈ నెల 21న కోమర్తిలోని అమరవీరుల స్తూపం వద్ద విప్లవ ఉద్యమ నేత మామిడి అప్పలసూరి 27వ వర్ధంతి సభ నిర్వహించనున్నామని సీపీఐ (ఎంఎల్)న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశ్ అన్నారు. పార్టీ కార్యకర్తలు, అప్పలసూరి కుటుంబ సభ్యులు, అభిమానులు పాల్గొనాలని కోరారు. వర్ధంతి సభకు సంబంధించి కరపత్రాన్ని అమరవీరుల స్తూపం వద్ద బుధవారం ఆవిష్కరించారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నశెట్టి రాజశేఖర్, న్యూ డెమొక్రసీ జిల్లా నాయకులు ఎస్.నీలంరాజు, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి డి.గణేష్, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలు ఎస్.కృష్ణవేణి, పీవైఎల్ జిల్లా కన్వీనర్ సార జగన్, కె.చిన్నబాబు పాల్గొన్నారు.

16న లోక్ అదాలత్



మాట్లాడుతున్న సివిల్ జడ్జి హరిప్రియ

నరసన్నపేట: ఈ నెల 16న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని, దీంట్లో వీలైనన్ని కేసులు పరిష్కారమయ్యేలా పోలీసులు, న్యాయవాదులు ప్రయత్నించాలని నరసన్నపేట కోర్టు సివిల్ జడ్జి సి.హరిప్రియ అన్నారు. బుధవారం కోర్టు పరిధిలో ఉన్న పోలీసు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలని కోరారు. పోలీసులు, న్యాయవాదులు కూడా కక్షిదారులతో మాట్లాడి కేసులు రాజీ చేసుకోవడానికి ప్రయత్నించాలన్నారు. కేసులు రాజీ చేసుకోవడానికి కక్షిదారులకు ఇది మంచి అవకాశమన్నారు.

మొల్లమాంబ విగ్రహావిష్కరణ



మొల్లమాంబ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

నరసన్నపేట: స్థానిక కుమ్మరివీధిలో నిర్మిస్తున్న కమ్యూనిటీ హాల్ వద్ద వాల్మీకి రచించిన రామాయణాన్ని తెలుగులోనికి అనువదించిన కవయిత్రి మొల్లమాంబ విగ్రహాన్ని బుధవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సామాజిక వర్గానికి చెందిన రాయల కృష్ణమూర్తి, శిష్టకరణ కార్పొరేషన్ డైరెక్టర్ సదాశివుని కృష్ణ, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రభాకర్, సామాజికవర్గం ప్రతినిధులు ఉరిటి కామేశ్వరరావు, రాయల మల్లేసు, రాయల దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

నేడు సరుబుజ్జిలిలో స్పీకర్ పర్యటన

సరుబుజ్జిలి: మండలంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం గురువారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు ఆమదాలవలస క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రొట్టవలస పాఠశాలలో చేపట్టిన నాడు–నేడు పనులు, అవతరాబాద్‌లో ఇంటింటికీ కుళాయిలు, సరుబుజ్జిలిలో పౌరసరఫరాల గోదాం ప్రారంభిస్తారన్నారు. ఈ కార్యక్రమాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

శ్మశాన వాటిక నిర్మాణం

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామంలో ఏడు దశాబ్దాల కల నెరవేరింది. ఇంతవరకు ఈ గ్రామంలో శ్మశాన వాటిక నిర్మాణం చేపట్టలేదు. స్పీకర్ తమ్మినేని సీతారాం దృష్టికి ఈ విషయాన్ని తీసుకెళ్లడంతో నిధులు మంజూరు చేశారని గ్రామానికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ గుమ్మడి రాంబాబు బుధవారం తెలియజేశారు. గ్రామంలో 80 సెంట్లు కేటాయించి జిల్లా పరిషత్ నిధులతో నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



ఆట స్థలాన్ని ప్రారంభిస్తున్న వైస్ ఎంపీపీ నాగరత్నం

జలుమూరు: క్రీడలతో మానసిక ఉల్లాసం కలుగుతుందని వైస్ ఎంపీపీ దోల నాగరత్నం అన్నారు. జలుమూరు ప్రాథమిక పాఠశాలలో పూర్వ విద్యార్థులు, పాఠశాల హెచ్‌ఎం మెండ రామారావు సంయుక్తంగా రూ.1.07 లక్షల నిధులతో సరస్వతి విగ్రహం, కిచెన్ షెడ్, ఆట వస్తువులు, ఆటస్థలం తదితరవి బుధవారం ఏర్పాటు చేశారు. వీటిని వైస్ ఎంపీపీ ప్రారంభించారు. పాఠశాల హెచ్‌ఎంను గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ప్రసాద్, మాధవరావు, తల్లిదండ్రుల కమిటీ సభ్యులు, పూర్వ విద్యార్థి దత్తుబాబు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి

- స్పీకర్ తమ్మినేని సీతారాం
- పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభం

పొందూరు: రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమం, జరిగిన అభివృద్ధిని చూసి మరోసారి సీఎం జగన్మోహన్‌రెడ్డిని ఆదరించాలని స్పీకర్ తమ్మినేని సీతారాం ప్రజలను కోరారు. పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రూ.1.54 కోట్లతో పూర్తి చేసిన అదనపు తరగతి గదులు, మౌలిక వసతుల గదులను బుధవారం ప్రారంభించారు. సందర్భంగా మాట్లాడుతూ ఆరు నుంచి తొమ్మిదో తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు చదువుపట్ల దిశానిర్దేశం చేశారు. పలువురు విద్యార్థులతో ముచ్చటించారు. భవిష్యత్‌లో ఏమవుతారని ప్రశ్నించడంతో పలువురు విద్యార్థులు ఐఏఎస్, ఐపీఎస్, డాక్టర్లు, ఇంజినీర్లు, ఆర్మీ అధికారులు అవుతారన్నారు. కృషి, పట్టుదల, దీక్షతోపాటు ఇష్టంతో చదివితే మీరనుకున్నది సాధించగలరన్నారు. ఆరో తరగతి నుంచే మీరు ప్రణాళికబద్ధంగా చదువుకోవాలన్నారు. ఎన్‌సీసీ విద్యార్థుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. దేశరక్షణ వ్యవస్థలో ఉద్యోగాలు సాధించేందుకు ఎన్‌సీసీ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.



పొందూరు: హైస్కూల్ విద్యార్థులతో ముచ్చటిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

అభివృద్ధి పనులు ప్రారంభం ఇలా..

కేసవదాసుపురంలో రూ.50 లక్షలతో పూర్తి చేసిన రోడ్డును, నందివాడలో రూ.40 లక్షలుతో పూర్తి చేసిన సచివాలయాన్ని, పొందూరులోని గొడగల కాలనీలో రూ.13.50 లక్షలతో రోడ్డును, రూ. 1.54 కోట్లతో హైస్కూల్లో పూర్తి చేసిన భవనాల అదనపు తరగతి గదులను, ఓకేషనల్ తరగతి గదులును, రాపాకలో రూ. 21.80 లక్షతో రైతు భరోసా కేంద్రాన్ని, రూ. 40 లక్షలతో పూర్తి చేసిన సచివాలయాన్ని, పిల్లలవలసలో రూ.72 లక్షలతో పూర్తయిన హైస్కూల్ అదనపు భవనాలు, దళ్లవలసలో రూ. 21.80 లక్షలతో పూర్తి చేసిన ఆర్‌బీకేలను ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో కళింగ కార్పొరేషన్ చైర్మన్ దుంపల రామారావు, ఎంపీపీ కిల్లి ఉషారాణి, జెడ్పీటీసీ లోలుగు కాంతారావు, మండల పార్టీ అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, బాదాన సునీల్, బండారు ప్రతాప్, అనకాపల్లి గోవింద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పొందూరు: దళ్లవలసలో ఆర్‌బీకేను ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస రూరల్: తోటాడ సచివాలయాన్ని ప్రారంభిస్తున్న స్పీకర్ తమ్మినేని సీతారాం

సచివాలయాలతో గ్రామస్వరాజ్యం

ఆమదాలవలస రూరల్: గ్రామ సచివాలయాల ఏర్పాటుతో గ్రామస్వరాజ్యాన్ని తీసుకువచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందని స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలో తోటాడలో రూ.40 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయాన్ని బుధవారం ప్రారంభించారు. స్పీకర్ మాట్లాడుతూ గ్రామాలను అభివృద్ధి పథంలో నడిపించాలనే భావనతో గ్రామ సచివాలయం, రైతు భరోసా, ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కళింగ కర్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ దుంపల రామారావు, సర్పంచ్ మెట్ట శారద, ఎంపీటీసీ తాండ్ర లక్ష్మి, మాజీ ఎంపీటీసీ బెండి రమణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో ప్రతీ ఓటు కీలకమే



నరసన్నపేట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

- నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సారవకోట: రానున్న సాధారణ ఎన్నికల్లో ప్రతి ఓటు కీలకమేనని, బూత్ కమిటీ సభ్యులు అప్రమత్తంగా ఉండాలని నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. మండలంలోని బుడితి గ్రామంలో గల ప్రైవేట్ కల్యాణ మండపంలో సారవకోట, జలుమూరు మండలాల బూత్ కమిటీ సభ్యులతో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు ధర్మాన కృష్ణచైతన్య, డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, తంగి మురళి, జలుమూరు మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.సీతారాం, పార్టీ నాయకులు శ్యామలరావు, తేజేశ్వరరావు, మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం కావాలి..

నరసన్నపేట: పేదలకు సంక్షేమ పథకాలు సక్రమంగా అందాలంటే మళ్లీ జగనన్న ముఖ్యమంత్రి కావాలని, ఈ మేరకు కార్యకర్తలు, బూత్ కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ అన్నారు. పోలాకి రోడ్డులోని ఓ కల్యాణ మండపంలో నరసన్నపేట, పోలాకి మండలాలకు చెందిన బూతు కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలతో మేం సిద్ధం.. మా బూత్ సిద్ధం కార్యక్రమంలో భాగంగా అవగాహన శిబిరాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికల్లో ప్రతి ఓటూ మనకు కీలకమన్నారు. గ్రామాల్లో ప్రచారం చేపట్టాలన్నారు. టీడీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలన్నారు. డీసీసీబీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్యలు మాట్లాడుతూ కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. మళ్లీ వైఎస్ జగన్ సీఎం కావాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, పోలాకి మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు ముద్దాడ బైరాగి నాయుడు, ఏఎంసీ చైర్మన్ భాస్కరరావు, వైఎస్సార్‌సీపీ నాయకులు చింతు రామారావు, పొన్నాన దాలినాయుడు, లుకలాపు రవి, కణిత కృష్ణారావు, సురంగి నర్సింగరావు, కణిత సత్తిబాబు పాల్గొన్నారు.



నరసన్నపేట: హాజరైన బూత్ కమిటీ సభ్యులు, సర్పంచ్‌లు, నాయకులు



సారవకోట: మాట్లాడుతున్న ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్

సీఎం జగన్‌కు అండగా నిలవాలి



మెళియాపుట్టిలో కరపత్రాలు అందజేస్తున్న రెడ్డి ఓంశ్రీకృష్ణ



ఎల్.ఎన్.పేట: సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్న విష్ణుమూర్తి

మెళియాపుట్టి: పేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన అందించారని పాతపట్నం ఎమ్మెల్యే తనయుడు రెడ్డి ఓంశ్రీకృష్ణ అన్నారు. మెళియాపుట్టి కేంద్రం, చాపర, పెద్దపద్మాపురం తదితర గ్రామాల్లో బుధవారం పర్యటించి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరించారు. కులం, మతం, వర్గం, పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ముఖ్యమంత్రి జగనన్న అని, మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. పార్టీ నాయకులు మాడుగుల రామారావు, జయమునిరావు, సలాన చిట్టి, షేక్ సయ్యద్, మీసాల రామచంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎల్.ఎన్.పేట: సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధికారం చేపట్టిన తరువాత అన్ని వర్గాల వారి సంక్షేమం కోసం అనేక పథకాలు అమలు చేశారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పెనుమజ్జి విష్ణుమూర్తి అన్నారు. మండలంలోని యంబరాంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల కోసం ప్రజలకు అవగాహన కలిగిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన ప్రతీ కుటుంబానికి ఇంటి వద్దకే సంక్షేమ పథకాలు ఇచ్చిన ఘనత జగనన్నకు దక్కిందన్నారు. తెలుగుదేశం పార్టీ నాయకుల మాయ మాటలు నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ఓటు వేసి జగనన్నను మరోసారి గెలిపించాలని ప్రజలను కోరారు.

వడదెబ్బపై అప్రమత్తం

మెళియాపుట్టి: వడదెబ్బ తగలకుండా విద్యార్థులు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు గ్రీష్మ అన్నారు. మండలంలోని కేజీబీవీ, మెళియాపుట్టి హైస్కూల్ విద్యార్థులకు బుధవారం వడదెబ్బపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ప్రశాంత వాతావరణంలో చదువుకోవాలన్నారు. ఎటువంటి వత్తిడికి గురైనా.. జంక్‌ఫుడ్‌కు అలవాటైనా, సమయానికి భోజనం చేయకుండా, తగినంత నీటిని తాగకుండా నిర్లక్ష్యం వహిస్తే వడదెబ్బ తగిలే అవకాశాలు ఉన్నాయన్నారు. కొబ్బరినీరు, దోసకాయలు, పుచ్చకాయలు, ఉప్పునీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు, బత్తాయి, నిమ్మరసం తీసుకోవాలన్నారు. వడదెబ్బ లక్షణాలు కనిపిస్తే వెంటనే ఆస్పత్రికి రావాలన్నారు. ఏఎన్‌ఎంలు, ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశ వర్కర్లు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న డాక్టర్ గ్రీష్మ

జీవనోపాధి పెంపొందించుకోవాలి

- వెలుగు ఏపీడీ సన్యాసిరావు

పాతపట్నం: వివిధ రంగాల్లో జీవనోపాధులు పెంపొందించుకోని, అభివృద్ధి పథంలో పయనించాలని వెలుగు ఏపీడీ ఎల్.సన్యాసిరావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వన్‌ధన్ వికాస్ కేంద్రాలు నిర్వహించడంపై బుధవారం ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా బ్లాక్ స్థాయిలో పనిచేస్తున్న ఎన్జీఓలు, గ్రామ పంచాయతీల్లోని పెద్దలతో, లబ్ధిదారులతో మాట్లాడి అవగాహన కల్పించాలన్నారు. సోంపేట, పలాస, నందిగాం, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట, టెక్కలి, సారవకోట, హిరమండలం, పాతపట్నం, మెళియాపుట్టి మండలాల్లోని 65 వీడీ వికాస్ సభ్యులు, ఎఫ్‌పీఓ, సీసీఎస్‌లు శిక్షణకు హాజరయ్యారు. ఎల్‌హెచ్‌డీపీఎం బి.నారాయణరావు, బీఎల్ డీపీఎం సుశీల, ఏపీఎంలు మనోరత్నం, ప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ సన్యాసిరావు

ఘనంగా ఎల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం



ముర్రాటలతో ఆలయానికి వెళ్తున్న భక్తులు

కొత్తూరు: మండలంలోని పొనుటూరు గ్రామ దేవత ఎల్లమ్మ ఉత్సవాలు బుధవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆలయం వద్ద భక్తులు పూజలు నిర్వహించారు. ముర్రాటలతో తిరువీధి నిర్వహించి ఎలమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. మూడు రోజులు ఉత్సవాలను నిర్వహించనున్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ సమావేశం

ఆమదాలవలస: పట్టణంలోని శారద కల్యాణ మండపంలో వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ విస్తత స్థాయి సమావేశం గురువారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు స్పీకర్ క్యాంప్ కార్యాలయం నుంచి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, ఉత్తరాంధ్ర డిప్యూటీ కో ఆర్డినేటర్, విజయనగరం జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, శ్రీకాకుళం పార్లమెంటరీ సమన్వయకర్త పేరాడ తిలక్ హాజరై పలు అంశాలపై చర్చించనున్నారని తెలిపారు. నాలుగు మండలాలు, మున్సిపాలిటీకి చెందిన వివిధ హోదాల్లో ఉన్న పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మాజీ కౌన్సిలర్లు, ఇన్‌చార్జి వార్డు మెంబర్లు, గృహసారథులు, కన్వీనర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

రూ.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేత



వెంకటరావుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని ఆర్.ఎల్.పురం గ్రామానికి చెందిన ఎంపీటీసీ రెడ్డి అపర్ణ భర్త రెడ్డి రాజు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2 లక్షల ఆర్థిక సహాయం మంజూరైంది. పాతపట్నంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో రాజు తండ్రి వెంకటరావుకు ఎమ్మెల్యే రెడ్డి శాంతి బుధవారం చెక్కు అందజేశారు. వెంకటరావు మాట్లాడుతూ కష్టకాలంలో తమను ఆదుకున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యే రెడ్డి శాంతికి రుణపడి ఉంటామన్నారు. ఏఎంసీ చైర్మన్ కొండాల అర్జునుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు రమణ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతులకు శిక్షణ

బూర్జ: మండలంలోని వావాం పంచాయతీ వువ్వపేట, వావాం, నీలాదేవిపురం గ్రామాల రైతులకు మొక్కజొన్న పంటలో వచ్చిన తెగుళ్ల నివారణపై బుధవారం స్థానిక ఆర్‌బీకేలో శిక్షణ ఇచ్చారు. శ్రీకాకుళం వ్యవసాయశాఖ ఏడీ వెంకటరావు, ఆమదాలవలస కేవీకే శాస్త్రవేత్త చిట్టిబాబు ఆధ్వర్యంలో రైతులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మొక్కజొన్న సాగుచేస్తున్న రైతులకు మెలకువలు, యాజమాన్య పద్ధతులు, సస్యరక్షణ చర్యలను వివరించారు. బూర్జ ఏడీ రాజగోపాలరావు, ఏఓ రాజేశ్వరరావు, వీఏఏలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో 6వ తరగతి, ఇంటర్ ఫస్టియర్ (బైపీసీ)లో ప్రవేశానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి ఎస్ .కృష్ణవేణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరో తరగతిలో 40, ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో 40 సీట్లుకు ఏప్రిల్ 11వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు కేజీబీవీలో సంప్రదించాలని కోరారు.

నేడు చేయూత చెక్కుల పంపిణీ

హిరమండలం: స్థానిక సచివాలయం-3 పరిధిలో జగనన్న చేయూత చెక్కుల పంపిణీ కార్యక్రమం గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్లు వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఓ వి.శ్రీరామచంద్రమూర్తి బుధవారం తెలిపారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి ముఖ్య అతిథిగా హాజరవుతారన్నారు. అధికారులు, డ్వాక్రా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

ఉపాధి పనులు పూర్తిచేయాలి

హిరమండలం: ఉపాధి హామీ పథకం ద్వారా చేపడుతున్న ఫారం ఫాండ్ పనులను ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని పాతపట్నం క్లస్టర్ ఏపీడీ పి.రాధ అన్నారు. హిరమండలంలోని ఉపాధి హామీ కార్యాలయ సమావేశ మందిరంలో హిరమండలం, కొత్తూరు, ఎల్.ఎన్.పేట, పాతపట్నం మండలాల ఉపాధి హామీ ఏపీఓలు టెక్నికల్, క్షేత్ర సహాయకులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఏపీడీ మాట్లాడుతూ వంద రోజుల ఉపాధి పని దగ్గరలో ఉన్న కుటుంబాలకు పనులు పూర్తిచేయించాలన్నారు. వేతనదారులు సమయపాలన చేపట్టాలన్నారు. ఉదయం ఆరు నుంచి పది గంటల వరకు, సాయంత్రం 3 నుంచి ఆరు గంటల వరకు పనులు చేపట్టాలన్నారు. పని ప్రదేశంలో పీహెచ్‌సీల ద్వారా ఓఆర్ ప్యాకెట్లు పని ప్రదేశంలో ఉంచాలన్నారు. క్వాలటీ కంట్రోల్ అధికారి ఎస్.సతీష్, ఏపీఓలు శ్రీనివాసరావు, శ్రీదేవి, సురేష్, ప్రేమలత, ఈసీ సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో మేలు

సరుబుజ్జిలి: ప్రకృతి వ్యవసాయం సాగు చేస్తున్న రైతులకు అనేక ప్రయోజనాలు ఉంటాయని వెలుగు సీసీ కూన రోజాలత తెలిపారు. మండలంలోని పాలవలస ప్రకృతి వ్యవసాయ యూనిట్‌లో ప్రకృతి సాగుపై మహిళా సంఘాల సభ్యులకు బుధవారం అవగాహన కల్పించారు. సేంద్రియ సహజ పద్ధతుల్లో సాగుచేసిన పంటలు, తృణధాన్యాలు ఆరోగ్య సంరక్షణకు ఎంతో దోహదపడతాయన్నారు. ప్రకృతి వ్యవసాయ టీమ్ మెంబర్లు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



శిక్షణలో పాల్గొన్న మహిళలు

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

సారవకోట: భవిష్యత్ ఉన్నత స్థాయికి ఎదగాలంటే 10వ తరగతి పునాదని ఎంఈఓ రమణ అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి విద్యార్థులకు బుధవారం వీడ్కోలు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ రానున్న 10వ తరగతి పరీక్షలకు విద్యార్థులు పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని, దీని కోసం ఆరోగ్యంపై శ్రద్ధ చూపించాలన్నారు. ఎటువంటి ఒత్తిడికి గురి కాకుండా పరీక్షలు రాయాలన్నారు. అనంతరం విద్యార్థులు పలు దేశభక్తి గీతాలకు, జానపద గేయాలకు నృత్యం చేశారు. ఎంఈఓ భూలక్ష్మి, హెచ్‌ఎం రామకృష్ణ, ఉపాధ్యాయులు సత్యారావు, నందికేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థులు

విద్యార్థులకు అభినందన

సారవకోట: మండలంలోని అలుదు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు హెచ్‌ఎం, ఉపాధ్యాయులు బుధవారం అభినందించారు. గత నెలలో విజయవాడకు చెందిన డ్రీమ్ చిల్డ్రన్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో పలువురు విద్యార్థులు బంగారు, వెండి పతకాలు సాధించినట్లు హెచ్‌ఎం తంప రామారావు తెలిపారు. 30 మంది విద్యార్థులు గీచిన చిత్రాలను నిర్వాహక కమిటీ వాళ్లకు పంపించామని, వాటిలో ఉత్తమ చిత్రాలను ఎంపిక చేసి బహుమతులు పంపించినట్లు తెలిపారు. విద్యార్థులకు చిత్రలేఖనంలో శిక్షణిస్తున్న ఉపాధ్యాయుడు జన్ని రమేష్‌ను ఈ సందర్భంగా ప్రత్యేకంగా అభినందించారు.



బహుమతులు పొందిన విద్యార్థులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సూపరింటెండెంట్‌పై ఫిర్యాదు

పొందూరు: స్థానిక సీహెచ్‌సీ సూపరింటెండెంట్ డాక్టర్ రామదాస్, జూనియర్ అసిస్టెంట్ అనూషపై వైద్యశాఖ ఉన్నతాధికారులకు ఆస్పత్రికి చెందిన వైద్యులు సుజాత, ప్రియాంక, ప్రతిభ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సూపరింటెండెంట్ రామదాస్ 10 గంటలకు హాజరు వేసుకుని తిరిగి పొందూరులోని తన రూమ్‌కు వెళ్లిపోతున్నారని తెలిపారు. జూనియర్ అసిస్టెంట్ పనితీరు అసహనం కలిగిస్తుందన్నారు. హెచ్‌డీఎఫ్ నిధులున్నా తాము సూచించిన ఓటీ పరికరాలు, సిజర్స్ తదితర పరికరాలు కొనుగోలు చేయకుండా వారికి నచ్చినవి కొనుగోలు చేస్తున్నారన్నారు. దీంతో సిజేరియన్‌లు చేసిన తర్వాత ఇబ్బందులు ఏర్పడుతున్నాయన్నారు. ఆస్పత్రి పనితీరు దారిలో పెట్టాలని డీసీహెచ్‌ఎస్‌ను, ఉన్నతాధికారులను కోరినట్లు తెలిపారు.